

ప్రయోగాత్మకం.. ఆలు సాగు 8లో

వర్షాకాలంలో ఆలు పంట సాగు ప్రయోగాత్మకంగా శ్రీకారం చుట్టారు. జహీరాబాద్ మండలం రంజోల్‌లో నారును నాటారు.



రేషన్.. పరేషాన్ 9లో

ప్రతీనెలా 5వ తేదీలోగా రేషన్ దుకాణాలకు రావాల్సిన బియ్యం.. 15వ తేదీ సమీపిస్తున్నా చిన్నశంకరంపేటలో ఇంకా పంపిణీ కాలేదు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని భరోసా సెంటర్‌లో కాంట్రాక్ట్ పద్ధతిన ఏడాది కాలానికి పని చేసేందుకు ఆసక్తి, అర్హత గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్పీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు. అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్స్, అనుభవ పత్రాలతో వాట్సాప్ నంబర్ 9014052175 ద్వారా ఈనెల 22వ తేదీలోగా పంపించాలన్నారు. పూర్తి వివరాలకు 9014052175 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఊపందుకున్న వరి నాట్లు

వర్షాలు కురవక ఆలస్యం..
- ఇప్పటి వరకు 20 శాతం నాట్లు
- ఘనాపూర్ ప్రాజెక్టు ఆయకట్టులో అధికం
- విడుదల కాని కాళేశ్వరం నీరు



మెదక్ మండలం ఔరంగాబాద్‌లో నారుతీస్తున్న కూలీలు

మెదక్‌జోన్: జిల్లాలో వరినాట్లు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. ఈ సారి వర్షాలు ఆశించిన మేర లేకపోవడంతో సాగు ఆలస్యమైంది. ఈ నెల 12న మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు రెండుగంటల పాటు జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. నెలరోజులుగా ఎదురు చూసిన అన్నదాల్లో ఈ వర్షం ఉత్సాహాన్నిచ్చింది. పొలాల్లో పుష్కలంగా నీరు చేరడంతో సంబురంగా వరి నాట్లు ప్రారంభించారు. మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ పేర్కొనటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పూర్తయింది 20 శాతమే..

- ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా లేకపోవటంతో జిల్లాలో సాగు ఆలస్యమైంది.
- పొలాల్లో వర్షపు నీరు చేరడంతో దుక్కులు దున్నుతూ నాట్లు ప్రారంభించారు.
- జిల్లా వ్యాప్తంగా 3,49,615 ఎకరాల్లో ఆయా పంటలు సాగవనున్నట్లు అధికారుల అంచనా.
- వరి 2.90 లక్షలు సాగు అంచనా ఉండగా, ఇప్పటి వరకు కేవలం 20శాతం వరినాట్లు పూర్తయ్యాయి. అంటే 57,758 ఎకరాల్లో నాటు పూర్తయింది.
- అధికారుల అంచనా ప్రకారం మరో 2,32,242 ఎకరాల్లో నాట్లు వేయాల్సి ఉంది.
- ఘనాపూర్ ప్రాజెక్టు ఆయకట్టుతో పాటు బోరుబావుల కింద సాగవుతోంది.
- మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు సింగూరు ప్రాజెక్టులోకి భారీ వరద రావటంతో ప్రాజెక్టు ఆయకట్టు కింద 21వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి.
- బోరుబావుల కింద మరో 36 వేల ఎకరాల్లో నాట్లు ప్రారంభమయ్యాయి.
- జిల్లాలో రామాయంపేట, చిన్నశంకరంపేట, చేగుంట మండలాల్లోని కొన్ని గ్రామాల్లో కాళేశ్వరం కాల్వలు తవ్వారు. 60 కిలోమీటర్ల మేర ఉన్న హల్దీ ప్రాజెక్టులోకి సైతం ఈ గోదావరి జలాలను రెండేళ్లుగా వదులుతున్నారు.
- ఈ నీటితో తూప్రాన్, వెల్దుర్తి, చిన్నశంకరంపేట, కొల్చారం, మెదక్, హవేళిఘనాపూర్, మండలాల పరిధిలో సుమారు 50 వేల ఎకరాలు సాగవుతున్నాయి.

213.6 మిల్లీమీటర్ల వర్షం

ఈనెల 12న జిల్లాలో 213.6 మి.మీ వర్షపాతం నమోదైంది. పెద్దశంకరంపేట, రేగోడు, అల్లాదుర్గం, కొల్చారం, చిలప్‌చెడ్ మండలాల్లో ఎక్కువగా కురిసింది. మాసాయిపేట మండలంలో 198.8 మి.మీ. అత్యధిక వర్షపాతం నమోదైంది. టేక్మాల్, పాపన్నపేట, హవేళిఘనాపూర్, రామాయంపేట, నిజాంపేట, మెదక్, కౌడిపల్లి, నర్సాపూర్, శివ్వంపేట, వెల్దుర్తి, తూప్రాన్ మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. చేగుంట, నార్సింగ్, చిన్నశంకరంపేట, మనోహరాబాద్ మండలాల్లో సాధారణం కన్నా తక్కువ నమోదైంది.

నీటి సమస్య తీరింది



రెండు వారాలుగా దుక్కులు దున్ని వర్షం కోసం ఎదురు చూశాం. ఇటీవల కురిసిన వర్షంతో పొలంలో పుష్కలంగా నీరు చేరింది. నాటువేసేందుకు ట్రాక్టర్‌తో దున్నించి సిద్ధం చేయిస్తున్నా.

– నాయిని సురేశ్, కొంగోడు, కొల్చారం మండలం

రెండెకరాల్లో నాట్లు వేశా



వర్షాల కోసం నెలరోజులుగా ఎదురు చూశా. బుధవారం భారీగా వర్షం కురవడంతో రెండెకరాల్లో వరి నాటు వేశా. వర్షాలు ఆలస్యం కావడంతో నాట్లు వెనకబడ్డాయి.

– దుర్గ్యా, ఔరంగాబాద్ తండా, మెదక్



మల్కాపూర్‌లో మొక్క నాటుతున్న ఓఎస్‌డీ ప్రియాంక వర్గీస్ , కలెక్టర్ రాజర్షిషా తదితరులు

అందరి సహకారంతోనే హరితహారం విజయవంతం

సీఎం ఓఎస్‌డీ ప్రియాంక వర్గీస్

మెదక్ కలెక్టరేట్: అందరి సహకారంతోనే హరితహారం కార్యక్రమం విజయవంతం అవుతుందని సీఎం ఓఎస్‌డీ ప్రియాంక వర్గీస్ అన్నారు. గురువారం మెదక్ కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి హరితహారంపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియాంక వర్గీస్ మాట్లాడుతూ... దశాబ్ధి సంపద వనాల్లో నాటే మొక్కలు పెద్దవిగా ఉండేలా చూడాలన్నారు. హైదరాబాద్ నుంచి చేగుంట రోడ్డులో ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలని, పడిపోయిన ట్రీ గార్డుల స్థానంలో కొత్తవి పెట్టాలని అధికారులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎంపీడీఓలు సమావేశమై అవసరమైన సూచనలు చేయాలన్నారు. చేగుం–మెదక్ రోడ్డుకు ఇరువైపులా చెట్లతో ఆహ్లాదంగా ఉందని, జిల్లాలోని అన్ని మండలాల్లో అవెన్యూ ప్లాంటేషన్లతో పాటు, మండలాల్లో విరివిగా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సమావేశంలో కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, అటవీ శాఖ అధికారి రవిప్రసాద్, జిల్లా స్థాయి అధికారులు, ఆయా మండలాల ఎంపీడీఓలు, ఏపీఓలు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కలు నాటాలి

తూప్రాన్: హరితహారం కార్యక్రమంలో భాగంగా అటవీ భూముల్లో పండ్ల మొక్కలు నాటాలని సీఎంఓ ఓఎస్‌డీ ప్రియాంక వర్గీస్ అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని మల్కాపూర్, గుండ్రెడ్డిపల్లి, దాతర్‌పల్లి గ్రామాల్లో కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి బృహత్ పల్లె ప్రకృతి వనం, గుండ్రెడ్డిపల్లిలో సంపద వనాలు, ఆదర్శ గ్రామం మల్కాపూర్‌లో పల్లె ప్రకృతి వనం, ఫారెస్ట్ హరితవనాలు, నర్సరీ, డంపింగ్ యార్డ్‌లో హరితవనాలను పరిశీలించారు. పల్లె ప్రకృతి వనంలో ఏర్పాటు చేసిన బుద్ధ విగ్రహానికి పూలమాల వేసి, మల్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పదో తరగతి విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మహాదేవి నవీన్, ఎంపీటీసీ పంజాల వెంకటమ్మ, ఉప సర్పంచ్ ఆంజనేయులు, ఏపీవో సంతోష్, పంచాయతీ కార్యదర్శి సంఘమేశ్వర్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

హుండీ లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మ ఆలయ హుండీని గురువారం దేవాదాయ శాఖ పర్యవేక్షకుడు శివరాజ్, ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. నాలుగు నెలల ఏడు రోజులకు హుండీ ద్వారా రూ.9.29 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ ఇన్‌స్పెక్టర్ రంగారావు, సర్పంచ్ సాయిలు, ఉప సర్పంచ్ కొండల్‌రెడ్డి, ఆలయ సిబ్బంది, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఆలయ కమిటీ డైరెక్టర్లు దొంతుల దుర్గయ్య, స్వామి, రవిసాగర్, శివరాజ్, అంజిగౌడ్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్ లాగ్ సీట్ల భర్తీకి..

మెదక్: పట్టణంలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలలో బ్యాక్ లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వర్థిని తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి 6, 7, 8వ తరగతిలో సీట్లకు ఈనెల 18వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు బోనాఫైడ్ సర్టిఫికెట్, ఒక ఫొటోను పాఠశాలలో అందించాలన్నారు. ఈనెల 19న ప్రవేశ పరీక్ష జరుగుతుందని, మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు.

ఆదేశాల మేరకు ఎన్నికలు



మాట్లాడుతున్న ఎండీ రజిని

మెదక్‌జోన్: స్టేట్ కో–ఆపరేటివ్ ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహిస్తామని ఫిషరీష్ ఏడీ రజిని తెలిపారు. గురువారం మెదక్ మండలం రాజ్‌పల్లి రైతుబజార్‌లో జిల్లా మత్స్య సహకార కో–ఆపరేటివ్ సంఘ సమావేశాన్ని నిర్వహించారు. సంఘం కాల పరిమితి ముగియటంతో సమావేశాన్ని ఏర్పాటు చేసి తాత్కాలిక మేనేజింగ్ డైరెక్టర్‌గా(ఎండీ)గా ఫిషరీష్ ఏడీ రజినిని ఎన్నుకున్నారు. మత్స్యసహ కార సంఘం మాజీ నాయకులు దుర్గేష్, రాజయ్య, లక్ష్మయ్య, వివిధ మండలాల సొసైటీల అధ్యక్షులు, సభ్యులు హాజరయ్యా.

16న డీడీఎన్ఎస్ సమావేశం

పెద్దశంకరంపేట(మెదక్): ఉమ్మడి జిల్లా ధూప, దీప నైవేద్య అర్చక సంఘం(డీడీఎన్ఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 16న గజ్వేల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అర్చక సంఘం ఉపాధ్యక్షుడు గుడి చంద్రశేఖరశర్మ తెలిపారు. ఆయ్యప్ప ఆలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం ఉటుందని, ముఖ్య అతిథిగా మంత్రి హరీశ్‌రావు, రాష్ట్ర అర్చక సంఘం ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. ఉమ్మడి జిల్లాలోని అర్చకులు, నూతనంగా ధూప, దీపనైవేద్య పథకంలో ఎంపికైన వారు హాజరుకావాలని కోరారు.

త్యాగాలు బీసీలవి.. భోగాలు మరొకరివి



మాట్లాడుతున్న మురళీయాదవ్

నర్సాపూర్: ఉద్యమంలో బీసీలు త్యాగాలు చేస్తే అగ్రవర్ణాలు భోగాలు అనుభవిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యమంలో పని చేసిన వారికి సీఎం కేసీఆర్ పదవులు ఇవ్వలేదని, కుల వృత్తులకు చేయూత పేరిట వారిని ఓటు బ్యాంకుగా వాడుకునేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. అగ్రవర్ణాలకు భయపడుతూ బీసీ, ఎస్సీలను అణగదొక్కుతున్నారని, గ్రామాల్లో బెల్టుషాపులు పెట్టించి యువతను మద్యానికి బానిస చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సాపూర్‌లో పాన్ షాపుల్లో గంజాయి అమ్ముతున్నా పట్టించుకోవడంలేదని, దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలన్నారు. సమావేశంలో కౌన్సిలర్ రాజేందర్ పాల్గొన్నారు.

మెదక్ డీపీఆర్‌ఓగా ఏడుకొండలు

మెదక్ కలెక్టరేట్: మెదక్ డీపీఆర్‌ఓగా ఏడుకొండలు నియామకమయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన శాంతికుమార్ బదిలీపై కామారెడ్డికి వెళ్లగా, ఆయన స్థానంలో సంగారెడ్డి అదనపు డీపీఆర్‌ఓ ఏడుకొండలు మెదక్‌కు వచ్చినట్లు సమాచారం.

ఇండ్ల కూల్చివేతలో ఉద్రిక్తత



గ్రామ పంచాయతీ వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

- నోటీసులు ఇవ్వకుండా కూల్చివేశారని బాధితుల ఆరోపణ
- గ్రామస్తులతో కలిసి మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆందోళన



కూల్చివేతలో ధ్వంసమైన ఇంటిని పరిశీలిస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): కాళ్ళకల్‌లో అక్రమ కట్టడాల కూల్చివేతలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. బాధితులకు కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మద్దతు తెలపడంతో మరింత ఆందోళనకరంగా మారింది. వివరాల్లోకి వెళితే.. కాళ్ళకల్ గ్రామంలో అక్రమ కట్టడాలపై కొంత మంది కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, విచారణ జరిపి అక్రమ కట్టడాలను కూల్చివేయాలని డీపీఓకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఉదయం 4 గంటలకు నర్సాపూర్ డీఎల్‌పీఓ యాదయ్య, తూప్రాన్ డీఎల్‌పీఓ శ్రీనివాస్‌రావుల ఆధ్వర్యంలో 8 మంది ఎంపీఓలు, 50 పంచాయతీ కార్యదర్శులు, తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి ఆధ్వర్యంలో 200 మంది పోలీసులతో కలిసి ఇండ్ల కూల్చివేత ప్రారంభించారు. సుమారు 9 ఇండ్లను కూల్చివేశారు. నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు ప్రారంభించారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గజ్వేల్ ఆత్మగౌరవ యాత్ర చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి వచ్చి కూల్చివేతలను అడ్డుకున్నారు. బాధితులతో కలిసి పంచాయతీ వద్ద నిరసన తెలపడంతో పోలీసులు, గ్రామస్తుల మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో నర్సారెడ్డి సొమ్మసిల్లి పడిపోవడంతో పోలీసులు ఆయనను గజ్వేల్‌కు తరలించారు. కూల్చివేతలకు ఫిర్యాదుదారులే కారణమంటూ ఆగ్రహించిన బాధితులు వారి ఇండ్లపై రాళ్లతో దాడి చేశారు. మళ్లీ వచ్చిన నర్సారెడ్డి జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలపడంతో భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. అక్రమంగా నిర్మించిన కట్టడాలను వదిలి సామాన్యులు, నిరుపేదల ఇండ్లను కూల్చడం ఏమిటని నర్సారెడ్డి ప్రశ్నించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. పోలీసులు నచ్చజెప్పడంతో పంచాయతీ వద్దకు వచ్చి ఆందోళన చేపట్టారు. ఎంపీపీ పురం నవనీత, కాళ్ళకల్, మనోహరాబాద్ సర్పంచ్‌లు నత్తి మల్లేష్, మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పురం మహేష్ బాధితులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఆర్డీఓ పరిశీలన

గ్రామంలో కూల్చివేసిన ఇండ్లను ఆర్డీఓ జయచంద్రారెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలు సేకరించారు. గ్రామంలో చోటుచేసుకున్న ఘటనపై పైఅధికారులకు నివేదిక అందిస్తానని తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీహెచ్ జితేందర్

మెదక్‌జోన్: చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ జితేందర్ అన్నారు. గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ లక్ష్మి శారద సూచనల మేరకు పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రీ లిటిగేషన్ కేసులపై అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి

ఎస్పీ రోహిణి ప్రియదర్శిని



మాట్లాడుతున్న ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

రామాయంపేట(మెదక్): రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నా మని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. గురువారం రాత్రి మండలంలోని పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. జిలిటిన్ స్టిక్స్ అక్రమ రవాణా విషయమై చర్యలు తీసుకుంటామని, ప్రమాదాల నివారణకు వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. ఇటీవల నార్సింగి, తూప్రాన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన చోరీల్లో ఒకరిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ లక్ష్మాబాబు, ఎస్‌ఐ రంజిత్ ఉన్నారు.

కాంగ్రెస్ నాయకులను తరిమికొట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి తదితరులు

ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: ఉచిత విద్యుత్ వద్దన్న కాంగ్రెస్ నాయకులను ఊర్ల నుంచి తరిమికొట్టాలని ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలో రైతులకు ఉచితంగా 24 గంటల కరెంటు ఇస్తుంటే 3 గంటలు చాలు అంటూ రేవంత్ రెడ్డి చెప్పడం సిగ్గుచేటన్నారు. బీజేపీ వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలని అంటుంటే, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ వద్దంటూ కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారని ఆరోపించారు. 70 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో అప్పుల బాధతో అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితికి కారమైందని విమర్శించారు. కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. వడ్లు కొనకుండా బీజేపీ, కరెంటు వద్దంటూ కాంగ్రెస్ నాయకులు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్, కాళేశ్వరం నీరు, మిషన్‌కాకతీయ వంటి సంక్షేమ పథకాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాన్ మారింది.. అంచనా పెరిగింది

- ఇష్టారీతిన అధికారుల నిర్ణయాలు
- ఆలస్యమవుతున్న అభివృద్ధి పనులు



ఫతేనగర్ వీధిలో ఫారెస్ట్ ఆఫీస్ పక్కన నిర్మాణంలో ఉన్న మార్కెట్ షెడ్డు

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ మున్సిపల్ పరిధిలో చేపట్టిన పనుల్లో ఆలస్యం జరుగుతోంది. అధికారులు ఇష్టారీతి, అనాలోచిత నిర్ణయాలతో ప్రజాధనం వృథాతో పాటు పనులు నత్తనడకన సాగుతున్నాయనే ఆరోపణలున్నాయి. అంతంత మాత్రమే పనులు చేస్తూ.. అంచనాకు మించి నిధులు ఖర్చు చేస్తున్నారనే విమర్శలు చేస్తున్నారు.

- మున్సిపాలిటీలో చిరు వ్యాపారులు వ్యాపారం నిర్వహించుకునేందుకు వీలుగా పట్టణంలోని ఫతేనగర్‌లో రూ.35లక్షలతో ఏడాది క్రితం షెడ్ల నిర్మాణం చేపట్టారు.
- రూ.15లక్షలతో నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయగా, పనులు జరుగుతుండగా మధ్యలో మోడ్రన్ మార్కెట్ అంటూ మరో ప్రణాళిక రూపొందించారు.
- అంతటితో ఆగకుండా అదనంగా మరో రూ.20లక్షలతో టెండర్ వేశారు. ఈ పనులు ఏడాది కాలంగా కొనసాగుతూనే ఉన్నాయి.
- పట్టణంలో సుమారు 350 మంది వీధి వ్యాపారులు ఉండగా, షెడ్ల నిర్మాణం పూర్తికాకపోవడంతో వీరంతా పట్టణంలోని రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది.
- కాంట్రాక్టర్ ప్రణాళిక రూపొందించగానే పనులు చేపట్టినా, మున్సిపల్ అధికారులు మాత్రం తీరికగా ఇటీవల మరోసారి టెండర్ నిర్వహించడం గమనార్హం.
- అధికారుల అనాలోచి నిర్ణయాలతో పనులు ఆలస్యమవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.
- మోడ్రన్ మార్కెట్‌ను త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని వ్యాపారులు కోరుతున్నారు.
- ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి పనులు వేగవంతంగా పూర్తి చేసి చిరు వ్యాపారులకు అందుబాటులోకి తీసుకొస్తే వారికి ఇబ్బందులు తొలగి పోవడంతోపాటు పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీరనుంది.
- నూతనంగా నిర్మిస్తున్న మార్కెట్ షెడ్ల వద్ద టాయిలెట్లు లేకపోవడం గమనార్హం. రద్దీ ఉండే స్థలాల్లో టాయిలెట్లు లేకుంటే తాము ఎలా వ్యాపారం చేసుకోవాలని చిరు వ్యాపారులు వాపోతున్నారు.

త్వరగా పూర్తి చేయాలి



లక్షల రూపాయల ప్రజాధనం ఖర్చుచేస్తున్నా ప్రజలకు ఉపయోగపడేలా పనులు చేయడం లేదు. ఏళ్లుగా పనులు సాగుతుండడంతో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి త్వరగా పనులు పూర్తిచేయాలి.

– తాహెర్, మెదక్

80 శాతం పూర్తయ్యాయి

చిరు వ్యాపారుల కోసం నిర్మిస్తున్న మార్కెట్ షెడ్ల నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయి. త్వరలోనే మిగతా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తాం.

– మహేష్, మున్సిపల్ డీఈ

క్లుప్తంగా

కల్యాణలక్ష్మి అవకతవకలపై విచారణ


విచారిస్తున్న అధికారులు

చేగుంట(తూప్రాన్): పెళ్లి జరిగిన రోజును మార్చి కల్యాణలక్ష్మి డబ్బులు తీసుకున్న విషయంలో పెద్దశివునూర్ గ్రామంలో గురువారం మండల ప్రత్యేక అధికారి జయరాజ్ విచారణ జరిపారు. గ్రామానికి చెందిన మనెగల్ల ఎల్లం కూతురు మానస వివాహం 2017, ఫిబ్రవరి 15న జరిపించారు. అప్పటికి మానస మైనర్ కావడంతో 2000, ఫిబ్రవరి 26న పెళ్లి జరిగినట్లు వివాహ పత్రికను సృష్టించి కల్యాణలక్ష్మి కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో కల్యాణలక్ష్మి డబ్బులు మంజూరయ్యాయి. ఇది తెలిసిన కొందరు తప్పుడు పత్రాలతో కల్యాణలక్ష్మి డబ్బులు మంజూరు చేయించుకున్నట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

ఈ విషయం తెలుసుకున్న మండల ప్రత్యేక అధికారి జయరాజ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్ యాదవ్‌లు గ్రామ పంచాయతీలో విచారణ జరిపి పలువురి వాగ్మూలాలను నమోదు చేసుకున్నారు. ఈ నివేదికను జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు పంపించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ప్రత్యేక అధికారి జయరాజ్ పేర్కొన్నారు. విచారణలో సర్పంచ్ రుక్మిణీభాయి జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్‌తో పాటు ఎల్లం కుటుంబీకులు స్థానికులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఏసీపీ రమేశ్

గజ్వేల్‌రూరల్: అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ ఏసీపీ రమేశ్ సూచించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత సూచనల మేరకు పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం సీఐ వీర ప్రసాద్‌తో కలిసి మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ రమేశ్ మాట్లాడుతూ విద్యార్థినులు ఇప్పటి నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండి తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేసుకోవాలని సూచించారు. నేరాలు జరిగిన వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. షీటీమ్ విధులు, మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టాలు, బాల్య వివాహాలు, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్స్, గుడ్ అండ్ బ్యాడ్ టచ్, మైనర్ డ్రైవింగ్, సమాజ రుగ్మతలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు, మహిళలు ఏవైనా ఇబ్బందులకు గురైతే 100 లేదా షీటీమ్ (8712667343), స్నేహిత మహిళాసపోర్ట్ సెంటర్(9494639498), మహిళా పోలీస్ స్టేషన్(8712667435)లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శశికళ, గజ్వేల్ షీటీమ్ ఏఎస్ఐ అమృత్, హెడ్ కానిస్టేబుల్ సంజీవరెడ్డి, కానిస్టేబుళ్లు యుగేందర్, అన్వేష్, మహిళా కానిస్టేబుల్ జ్యోతి, కళాశాల అధ్యాపక బృందం, పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని పాడిగేదె మృతి


గేదె కళేబరం

శివ్వంపేట(నర్సాపూర్): ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో పాడిగేదె మృతిచెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన పట్నం నర్సింలు వ్యవసాయ సాగుతో పాటు పశుపోషణతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజువారిగానే తన పశువులను మేతకు తీసుకెళ్లాడు. మేత మేసిన అనంతరం పశువులను గ్రామానికి తీసుకొస్తున్న క్రమంలో రోడ్డు దాటుతుండగా సంగారెడ్డి ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సు పాడి గేదెను ఢీకొంది. ఈ ఘటనలో పాడి గేదె మృతి చెందింది.

గాయపడ్డ నెమలికి చికిత్స

నారాయణఖేడ్: రోడ్డుప్రక్కన గాయాలతో పడి ఉన్న ఓ నెమలిని యువకుడు రక్షించి చికిత్స చేయించి అటవీశాఖ అధికారులకు అప్పజెప్పాడు. వివరాలు ఇలా ఉన్నాయి..నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్ తండాకు చెందిన యువకుడు మోహన్ గురువారం సాయంత్రం మోటారుసైకిల్‌పై నారాయణఖేడ్‌కు వస్తుండగా రోడ్డుపక్కన ఓ నెమలి గాయమై కనిపించింది. దీన్ని గమనించిన మోహన్ దాన్ని తీసుకొచ్చి ఖేడ్ పశువైద్యశాలలో చికిత్స చేయించాడు. అనంతరం స్థానిక అటవీశాఖ సిబ్బందికి అప్పగించారు. మోహన్‌ను అటవీశాఖ సిబ్బంది అభినందించి. అది పూర్తిగా కోలుకున్నాక అడవిలో వదిలేస్తామని అధికారులు తెలిపారు.

ప్రయోగాత్మకం.. ఆలు సాగు

వర్షాధారం కింద పంట

- ఏ మేరకు వస్తుందనే దానిపై పరిశీలన
- రంజోల్‌లో ఎకరం పొలంలో నాటిన ఆలుగడ్డ నారు
- బెంగుళూరు నుంచి తీసుకొచ్చిన మొక్కలు


బొప్పాయిలో అంతర పంటగా సాగు చేసిన ఆలు

జహీరాబాద్: వర్షాకాలంలో ఆలు పంట సాగు ప్రయోగాత్మకంగా శ్రీకారం చుట్టారు. గురువారం జహీరాబాద్ మండలంలోని రంజోల్ గ్రామంలో అపైకల్ రూట్ కటింగ్ విధానంలో పెంచిన నారును పొలంలో నాటారు. గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రెడ్డి వద్ద అర ఎకరం, జగన్నాథ్‌రెడ్డి వద్ద మరో అర ఎకరంలో ఆలు నారు మొక్కలను నాటారు. కర్ణాటక రాష్ట్రం, బెంగుళూరులోని హసన్ ప్రాంతంలో ఉన్న ల్యాబ్‌లో ఎఫ్ఓ హైబ్రీడ్ కుఫ్రీ హిమాలిని ఆలుగడ్డ నారు మొక్కలను పెంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. అక్కడి నుంచి రైతులు గ్రామానికి తెచ్చుకుని నాటారు. సెంట్రల్ పొటాటో ఇనిస్టిట్యూట్ తరఫున రైతులకు ఉచితంగా ఆలుగడ్డ నారు మొక్కలను సరఫరా చేశారు. ఇండోనేషియా టెక్నాలజీలో క్రాఫ్‌ను డెవలప్‌చేసి దాని ఆధారంగా పొటాటో ఇనిస్టిట్యూట్‌లో ఏఆర్‌సీ విధానంలో ఆలు మొక్కలను పెంచి సాగుకు ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం బెంగుళూరు ప్రాంతంలో వర్షాకాలంలో సాగు చేస్తున్న ఆలుగడ్డ పంట మంచి ఫలితాలనిస్తుంది. మొదటి సారిగా జహీరాబాద్‌లో మూడు ఎకరాల్లో ప్రయోగాత్మకంగా సాగు చేయాలని ఉద్యానవన శాఖ నిర్ణయించింది. ప్రస్తుతం ఎకరం భూమిలో సాగును పూర్తి చేశారు. మరో రెండెకరాల్లో సాగు చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎకరం పొలంలో 30వేల మొక్కలు అవసరం అవుతాయని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఒక్కో మొక్క ఖరీదు రూ.3లు ఉందన్నారు. ఇంత ఖరీదైనది కావడంతో రైతులకు సాగు భారం అవుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఏఆర్‌సీ విధానాన్ని విస్తృతం చేస్తే తక్కువ ఖర్చుతో మొక్కలు లభ్యమయ్యే అవకాశం ఉంటుందంటున్నారు. వర్షాకాలంలో సాగు చేసుకునే ఆలుగడ్డ పంటకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుంది. అన్ సీజన్ కావడమే ఇందుకు కారణం. ప్రస్తుతం యాసంగిలో సాగుచేస్తున్న ఆలుగడ్డ పంటకు నల్ల మచ్చల తెగుళ్లు, వైరస్ తెగుళ్లు అధికంగా సోకుతున్నందునా పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతున్నందునా రైతులకు గిట్టుబాటు కావడం లేదనే ఉద్దేశ్యంతో నారు విధానంలో ఆలు మొక్కలను ప్రోత్సహించేందుకు చేస్తున్న ప్రయత్నమని చెబుతున్నారు.


నాటేందుకు నారును తీసుకెళ్తున్న కూలీ


నారును పరిశీలిస్తున్న రైతులు

ఏమేరకు ఫలితం ఉంటుందనేదానిపై దృష్టి..

ప్రస్తుతం వర్షాకాలంలో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న ఆలుగడ్డ పంట దిగుబడులు ఏమేరకు ఉంటాయనే దానిపై ఉద్యానవన శాఖ దృష్టి పెట్టింది. జూన్, జూలైలో సాగు చేయడం ద్వారా సెప్టెంబర్‌లో పంట చేతికి వస్తుందని భావిస్తున్నారు. ఇలా వచ్చిన పంటలో నాణ్యమైన పంటను మార్కెట్లో విక్రయించుకుని, మిగిలిన చిన్న చిన్న దుంపలు, పచ్చ దుంపలను యాసంగిలో విత్తనంగా వినియోగించుకోవచ్చనే విషయమై పరిశీలిస్తున్నారు. యాసంగిలో చలి అధికంగా ఉండడంతో పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. వర్షాకాలంలో వాతావరణం ఏమేరకు అనుకూలంగా ఉంటుందనేది కూడా ప్రయోగంలో తెలుస్తుంది. కుఫ్రీ హిమాలిని రకం ఇక్కడి వాతావరణం, నేలలకు ఎంత మేర ఉపయోగకరంగా ఉంటుందనే దానిపై అధ్యాయనం చేస్తున్నారు. ప్రతి ఏటా రైతులు యాసంగిలో మాత్రమే ఆలుగడ్డ పంటను సాగు చేసుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా ప్రాంతం నుంచి విత్తనాన్ని కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు.

అంతర పంటగా వేశాను..



ఉద్యానవన శాఖ ఉచితంగా ఆలుగడ్డ నారు మొక్కలను అందజేసింది. దీంతో ప్రయోగాత్మకంగా అర ఎకరంలో 11వేల మొక్కల వరకు సాగు చేశాను. ప్రస్తుతం బొప్పాయి పంట సాగులో ఉంది. అందులోనే అంతర పంటగా వేశాను. పంట బాగా వస్తే భవిష్యత్తులో రైతులు ఈ విధానంలో సాగు చేసే అవకాశం ఉంది. వర్షాకాలంలో కూడా ఈ ప్రాంతంలో విస్తారంగా సాగుకు బీజం పడుతుంది.

–నల్ల నాగేశ్వర్‌రెడ్డి, రైతు, రంజోల్

ప్రయోగం మాత్రమే



ప్రస్తుతం ఆలుగడ్డ మొక్కలను ప్రయోగాత్మకంగానే సాగు చేయిస్తున్నాం. బెంగుళూరు ప్రాంతంలో మంచి ఫలితాలనిస్తున్నందునా సెంటర్ పొటాటో ఇనిస్టిట్యూట్ తరఫున కుఫ్రి హిమాలిని అనే రకం ఆలును వర్షాధారంగా సాగు చేయిస్తున్నాం. అవసరమనుకుంటే నీటిని అందించాల్సి ఉంటుంది. ఇది విజయవంతం అయితే సాగును ప్రోత్సహిస్తాం.

–అనూషరెడ్డి, ఉద్యానవన అధికారి, జహీరాబాద్

భక్తి శ్రద్ధలతో బోనాలు

నర్సాపూర్: నర్సాపూర్ పట్టణ ప్రజలు భక్తి శ్రద్ధలతో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి సాయంత్రం ఫలహార బండ్లు ఊరేగించారు. బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే చిలుములమదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్, తెలంగాణ పీసీసీ ఉపాధ్యక్షుడు మెదక్ పార్లమెంటు ఇన్‌చార్జ్ గాలి అనిల్‌కుమార్ తదితరులు ఆలయాల్లో పూజల్లో పాల్గొన్నారు. ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన ఫలహార బండ్ల ఊరేగింపులో హాజరయ్యారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయాలు, ఫలహార బండ్ల నిర్వాహకులు ఆయా పార్టీల నాయకులను శాలువా కప్పి సన్మానించారు.


నర్సాపూర్‌లో ఫలహార బండి ఊరేగింపులో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

విద్యుదాఘాతంతో రైతు మృతి


కొమురయ్య మృతదేహం

కొండపాక(గజ్వేల్): విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందాడు. ఈ సంఘటన కుకునూరుపల్లి మండలంలోని తిప్పారంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కొమురయ్యకు తనకున్న వ్యవసాయ భూమితో పాటు అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆకుల భద్రప్ప వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. కౌలుకు తీసుకున్న వ్యవసాయ పొలం వద్ద బోరు మోటార్‌కు విద్యుత్తు సరఫరా కాకపోవడంతో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్‌ను సరి చేస్తుండగా ప్రమాదవ శాత్తు విద్యుదాఘాతానికి గురై ఇరుసాల కొమురయ్య మృతి చెందాడు. మృతుని భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపారు.

జీవితంపై విరక్తితో ఇద్దరి ఆత్మహత్య

మెదక్ మున్సిపాలిటీ: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కలాన్‌శెట్టిపల్లి గ్రామానికి చెందిన బాగిర్థిపల్లి కళావతి సిద్దిరాంలు పెద్ద కుమారుడైన భాగిర్థిపల్లి రాజు(35) గత కొంతకాలంగా మెదక్‌పట్టణంలోని నర్స్‌ఖేడ్ వీధిలో నివాసం ఉంటున్నాడు. 2017లో కొంతంపల్లి గ్రామానికి చెందిన పోచమ్మతో పెళ్లి జరిగింది. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా పోచమ్మ రాజును వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ విషయంలో తరచూ బాధపడుతు ఉండేవాడు. బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో రాజు స్థానిక మల్లెం చెరువు ఒడ్డున చింతచెట్టుకు ఉరివేసుకున్నాడు. మృతుని తల్లి కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పోచయ్య పేర్కొన్నారు.

జహీరాబాద్‌లో..


వెంకటేశ్వర్ (ఫైల్)

జహీరాబాద్: మనోవేదనకు గురై యువకుడు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ..కాశీంపూర్ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్(27) ఉన్నత చదువులు చదివినప్పటికీ ఉద్యోగం రాలేదు. దీంతో హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో కరోనా సమయంలో గ్రామంలోనే ఉండిపోయి ప్రభుత్వ ఉద్యోగం రాలేదని మనోవేదనకు గురయ్యేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది గురువారం గ్రామంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

హత్యకేసులో ఆరు సంవత్సరాల జైలు

పటాన్‌చెరు టౌన్: హత్యకేసులో ఓ వ్యక్తికి ఆరు సంవత్సరాల జైలు శిక్ష విధించిన సంఘటన భానూర్–బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..అస్సాం నుంచి బతుకుదెరువు కోసం వచ్చి పాశమైలారం పారిశ్రామికవాడలో పనిచేసుకుంటూ అద్దె రూంలో బిశ్వేశర్ బోరా, బుపెన్‌బోరాలు ఉంటున్నారు. ఈ క్రమంలో 2020, సెప్టెంబర్, 13 తేదీన రూమ్‌లో గొడవ జరిగి బుపెన్‌బోరాను బిశేశ్వర్ బోరా హత్యచేశాడు. అప్పట్లో బీడీఎల్ సీఐ రాంరెడ్డి నిందితుడు బిశేశ్వర్ బోరను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. గురువారం వాదోపవాదాలు విన్న నాలుగో అడిషనల్ సెషన్ కోర్టు న్యాయమూర్తి లావణ్య నిందితుడైన బిశేశ్వర్ బోరాకు ఆరు సంవత్సరాల జైలు శిక్షను విధించినట్లు పోలీసులు తెలిపారు.

పెళ్లి విషయంలో తండా వాసుల ఘర్షణ

శివ్వంపేట(నర్సాపూర్): యువతిని ప్రేమించిన యువకుడితో పెళ్లి జరిపించే విషయంలో తండా వాసులు ఘర్షణ పడ్డారు. ఓ తండాకు చెందిన యువతిని మరో తండాకు చెందిన యువకుడు ప్రేమించాడనే విషయం ఇంట్లో తెలియడంతో యువతిని 4 నెలల క్రితం మరో వ్యక్తితో పెళ్లి జరిపించారు. గత కొన్నాళ్ల నుంచి పెళ్లయిన యువతిని ప్రేమించిన వ్యక్తి ఫోన్ సంభాషణ చేస్తూనే పాటు పాత ఫోటోలు పెట్టాడు. ఈ విషయం భర్తతో పాటు వారి కుటుంబ సభ్యులకు తెలియడంతో యువతిని పుట్టింటికి పంపించేశారు. ఈ విషయంపై ఇరు తండావాసుల పెద్దలు రెండు రోజుల క్రితం పంచాయితీ పెట్టారు. పెళ్లి చేసుకున్న వ్యక్తితో ప్రేమ వ్యవహారం గొడవకు దారితీసినందునా యువతిని ప్రేమించిన యువకుడు పెళ్లి చేసుకోవాల్సిందిగా ఇరు తండా పెద్దలు నిర్ణయించారు. అందుకు యువకుడు సైతం ఒప్పుకున్నాడని మరుసటి రోజు పెళ్లి చేసుకోనని మాటమార్చడంతో ప్రేమ వ్యవహారం పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. గురువారం ఇరు తండావాసులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని గొడవ పడ్డారు. మరోమారు ఇరు తండా పెద్దలు పోలీస్‌స్టేషన్‌లో చర్చించినప్పటికి కొలిక్కి రాలేదు. యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ వలలో ప్రైవేట్ ఉద్యోగి..

పటాన్‌చెరు టౌన్: వాట్సాప్‌కు వచ్చిన మెసేజ్‌కు స్పందించి ఓ ప్రైవేట్ ఉద్యోగి రూ.7.90లక్షలు పోగొట్టుకున్నాడు. ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం..పటాన్‌చెరు మండల పరిధిలోని ఘణపూర్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగికి జూన్ 8వ తేదీన వాట్సాప్‌కు ఓ మెసేజ్ వచ్చింది. దీనికి స్పందించి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో బాధితునికి గిఫ్ట్ వచ్చిందని చెప్పి నమ్మించాడు. బాధితుడు ముందుగా రూ.4వేలు చెల్లించాడు. అనంతరం గిఫ్ట్‌లు గోల్డ్‌సెట్, ఐఫోన్, ట్యాబ్, బంగారు గాజులతో పాటు రూ.16 లక్షల నగదు ఎయిర్ పోర్ట్‌కు వచ్చాయని, వాటికి ట్యాక్స్ కట్టాలని పలు దఫాలుగా సైబర్ నేరగాళ్లు బాధితుడి నుంచి రూ.7,90,000లు చెల్లించాడు. ఇంకా నగదు చెల్లించాలని అడగడంతో అనుమానం వచ్చిన బాధితుడు తను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం భానూర్–బీడీఎల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

తండ్రిపై కొడుకు దాడి

చికిత్స పొందుతూ మృతి


మృతి చెందిన రాజయ్య

నంగునూరు(సిద్దిపేట): భూమి విషయమై జరిగిన గొడవలో తండ్రిపై కొడుకు దాడి చేయగా చికిత్స పొందుతూ తండ్రి మృతి చెందిన సంఘటన ఘణపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..నంగునూరు మండలం ఘణపూర్ గ్రామానికి చెందిన ఎర్రవెల్లి రాజయ్య (65) భార్య కనకవ్వ, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు రవి వ్యవసాయం చేస్తూ గ్రామంలో నివసిస్తుండగా చిన్నకుమారుడు రాజమల్లు బతుకుదెరువు కోసం సిద్దిపేట వెళ్లాడు. బుధవారం రాత్రి తండ్రితో కలసి మద్యం సేవించిన రవి వ్యవసాయ భూమిని కౌలుకు ఇచ్చే విషయమై తండ్రితో గొడవ పడి కర్రతో కొట్టాడు. ఈ ఘటనలో రాజయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గురువారం ఉదయం ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రాజయ్య మృతి చెందాడు. చిన్న కుమారుడు రాజమల్లు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాజుగౌడ్ తెలిపారు.

రెండు ఇళ్లు దగ్ధం


కాలిపోయిన ఇల్లు

మనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండలం మేఘ్యానాయక్ తండాలో గురువారం మధ్యాహ్నం రెండు ఇళ్లు దగ్ధమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..తండాకు చెందిన బానోత్ సుకులాల్, బానోత్ నరేందర్‌లకు చెందిన రెండు ఇళ్లు దగ్ధం కాగా స్థానికులు అప్రమత్తమయ్యి మంటలను ఆర్పారు. అప్పటికే ఇళ్లలో ఉన్న నిత్యావసర వస్తువులు, ధాన్యం పూర్తిగా కాలిపోయాయి. సుకులాల్ ఇంట్లో రూ.5లక్షల నగదు, నరేందర్ ఇంట్లో తులం బంగారం, 15తులాల వెండి, బట్టలు కాలిపోయాయని తెలిపారు. అగ్ని ప్రమాదానికి కారణం షార్ట్ సర్క్యూట్ ఉండొచ్చని తండావాసులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మండల రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వగా తహసీల్దార్ కిషన్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామ నిర్వహించి వివరాలు సేకరించారు. కాగా బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

కల్వర్టును ఢీకొట్టిన ప్రైవేట్ స్కూల్ బస్సు


కల్వర్టును ఢీకొట్టిన స్కూలు బస్సు

వట్‌పల్లి(అందోల్): ప్రైవేట్ స్కూల్ బస్సు బ్రేకులు ఫెయిల్‌అయి కల్వర్టును ఢీకొట్టిన ఘటన గురువారం పోతులబోగుడా గ్రామ శివారులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..వట్‌పల్లి అక్షర పాఠశాల స్కూల్ బస్సు గురువారం ఉదయం చేవెళ్ల పోతులబోగుడా గ్రామాల నుంచి పిల్లలను పాఠశాలకు తీసుకురావడానికి వెళ్తున్న సమయంలో బస్సు బ్రేకులు ఫెయిల్‌అయి అదుపు తప్పి రోడ్డుపక్కనే ఉన్న కల్వర్టును ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు భాగం ధ్వంసమవడంతో పాటు అద్దాలు పగిలాయి. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో విద్యార్థులు లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు వాపోయారు.

ప్రమాదవశాత్తు కాల్వలో పడి పూజారి మృతి


సత్యనారాయణచార్యుల మృతదేహం

సిద్దిపేటకమాన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన పూజారి ప్రమాదవశాత్తు కాలుజారి కాల్వలో పడి మృతి చెందాడు. సిద్దిపేట వన్‌టౌన్ సీఐ బిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం..మరిగంటి సత్యనారాయణచార్యులు(51) పూజారిగా విధులు నిర్వహిస్తూ గణేష్‌నగర్‌లో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఈ నెల11వ తేదీన ఇమాంబాద్ గ్రామ శివారులో పూజ ఉందని ఇంట్లో వాళ్లకి చెప్పి బయటకు వెళ్లాడు. వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. ఈ క్రమంలో ఇమాంబాద్ శివారులోని కాల్వలో గురువారం గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ విషయాన్ని మృతుడి ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో మృతుడి కుటుంబ సభ్యులు వాట్సాప్ ద్వారా తెలుసుకుని గుర్తించారు. మృతుడి భార్య కల్యాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనారోగ్యంతో ఉద్యమకారుడి మృతి


కనకయ్య (ఫైల్)

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ ఉద్యమకారుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లిలోని నిరుపేద కుటుంబానికి చెందిన కాసమొల్ల కనకయ్య ప్రత్యేక రాష్ట్ర సాధనకు ఏ కార్యక్రమం జరిగినా చురుగ్గా పాల్గొన్నాడు. గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు.

ఆర్థిక సాయం:

గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ విషయం తెలుసుకొని గురువారం బాధిత కుటుంబానికి రూ. 25వేలు సాయం అందజేశారు. ఈ సందర్భంగా మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి కనకయ్య చేసిన సేవలు మరువలేనివన్నారు. పీఏసీఎస్ చైర్మన్ జేజేల వెంకటేశం, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, వైస్ ఎంపీపీ బెల్లె కృష్ణగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండ మధు, జెడ్పీటీసీ మల్లేశం తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఈ కార్యక్రమంలో రమేష్‌గౌడ్, మాధవరెడ్డి, గాలెంక శ్రీను, పోషయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

ఆటో, బైక్ ఢీ..మైనర్ మృతి

- మరో బాలుడికి తీవ్ర గాయాలు, పరిస్థితి విషమం


శ్రీమాన్ (ఫైల్)

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పట్టణంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్ ఆటో ఢీ కొన్న ఘటనలో బాలుడు మృతిచెందడంతో పాటు మరో బాలుడికి తీవ్ర గాయలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానికులు, సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని నాసర్‌పురాకు చెందిన తరిగొప్పుల శ్రీమాన్ (16), రేషం దివేంద్ర (18)లు చిన్నప్పటి నుంచి స్నేహితులు. వీరిద్దరూ పట్టణంలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. గురువారం సాయంత్రం శ్రీమాన్, దివేంద్రలు ముస్తాబాద్ చౌరస్తా నుంచి పుల్లూరు వైపు వెళుతుండగా నిమ్రా గార్డెన్ ఎదురుగా, భారత్ పెట్రోలియం వద్ద ఆటోను వీరు ప్రయాణిస్తున్న బైక్ వేగంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి ఇద్దరు ఎగిరి రోడ్డుపై పడ్డారు. ఈ ఘటనలో శ్రీమాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. దివేంద్ర తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది గాయపడిన దివేంద్రను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి తలకు బలమైన గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ సిఐ బిక్షపతి తెలిపారు.


ప్రమాదానికి గురైన బైకును ఆటోలో పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న సిబ్బంది

మందుబాబులకు జరిమానా, జైలు

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానాతో పాటు జైలు శిక్ష విధించింది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని పలు చౌరస్తాల్లో వారం రోజుల క్రితం తమ సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో 21 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ గురువారం పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన సిద్దిపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి రమేష్‌బాబు రూ.46,500లు జరిమానా విధించారు. ఒకరికి ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

ఓటు వేద్దాం ఇలా...

ఓటు ఏ విధంగా వేయాలి. ఈవీఎంలను ఎలా ఉపయోగించాలో గ్రామీణ, పట్టణ ఓటర్లకు ఎన్నికల అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం పట్టణంలోని నర్సాపూర్‌లో ఎన్నికల అధికారులు ఓటర్లను ఇలా నిలబెట్టి ఓటు వేయిస్తున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది .

–కె.సతీశ్, సాక్షిస్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

